విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక స్తంభాల గరువులోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి పరీక్షలు జరుగుతున్న తీరును శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా విద్యాశాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలనీ కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు 230 మంది విద్యార్థులు హాజరు అయ్యారని, ఎవ్వరును గైర్హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఖుద్దూస్, గుంటూరు పశ్చిమ మండల తాసిల్దార్ సాంబశివరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో వేల కోట్లు దోపిడీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాల పంపిణీ, పక్కా ఇళ్ల నిర్మాణం పేరుతో వైసిపి ప్రభుత్వం వేల కోట్ల దోపిడీకి పాల్పడిందని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో 8లక్షల గృహాల నిర్మాణం కొనసాగించి 95శాతం పూర్తి చేస్తే ఇంతవరకు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఆర్భాటం కోసం తూతుమంత్రంగా గృహ ప్రవేశాలు చేసారు కానీ ఇంతవరకు లబ్ధిదారులకు ఇళ్ళు కేటాయించలేదు. ఇళ్ల లబ్ధిదారులకు కేంద్రం నుంచి వచ్చిననిధులు తప్పితే మీరు ఒక్క రూపాయి కూడా లబ్ధిదారులకు రాష్ట్ర వ్యాప్తంగా 5శాతం కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. పేదల పట్ల ప్రభుత్వం చెప్పే దానికి చేసే దానికి పొంతన లేకుండా పోతుందని వాపోయారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రామారావు, మల్లెంపూడి శ్రీనివాసరావు, కంచర్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ స్కూల్‌లో తరావీ నమాజ్

విశాలాంధ్ర-గుంటూరు : పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మూడు రోజుల తరబడి నమాజును ఈ నెల 11, 12, 13వ తేదీల్లో పొన్నూరు రోడ్డులోని అంజుమన్ ఇస్లామియా హైస్కూల్లో నిర్వహించనున్నట్లు మదర్స మెహమూదీయా అధినేత గుంటూరు జిల్లా జమియతుల్ ఉలమ నాయకులు ఖారీ ఉస్మాన్ తెలిపారు. స్థానిక ఆనందపేటలోని మదర్సాలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు నగర ప్రజల కోరిక మేరకు అంజుమన్ కమిటీ సహకారంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవిత్ర ఖురాన్ షరీఫ్‌ను మూడు రోజుల తరావిలో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రంజాన్ మాసంలో ప్రతిఒక్కరూ ఖురాన్ షరీఫ్‌ను చదవడం, వినడం ఎంతో పుణ్య కార్యక్రమంగా భావిస్తారని చెప్పారు. మూడో రోజు నమాజ్ పూర్తి చేసిన వారికి సహరి ప్రత్యేక విందు కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని ఖారీ ఉస్మాన్ కోరారు.

కేవీకే పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-గుంటూరు : అరండల్‌పేటలో డాక్టర్ కొలిచలా వెంకట కృష్ణ మూర్తి సంస్కృత కళాశాలలో 1970, 80 దశకాలలో విద్యా ప్రవీణ, భాషా ప్రవీణ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం దాదాపు 150 మందిపైగా సమావేశమై సందడి చేశారు. ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులు, గత స్మృతులు నెమరువేసుకున్నారు. ముఖ్యఅతిథిగా అష్టావధాని, బ్రహ్మశ్రీ ఆచార్య బేతవోలు రామబ్రహ్మంను వేద పండితులు మేళతాళాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం దంపతులతో పాటు పూర్వాచార్యులు డాక్టర్ దిగంబర సుబ్రహ్మణ్య శాస్త్రి, డాక్టర్ ఆకెళ్ళ మల్లు సోమయాజులు, డాక్టర్ భువనగిరి శ్రీనివాస వరప్రసాద్, డాక్టర్ ఆంజనేయ శాస్త్రి, పుల్లాభట్ల వెంకటేశ్వర్లు తదితరులను శాలువాలు పూలదండలు సన్మాన పత్రాలతో ఘనంగా సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ కొలిచల కృష్ణమూర్తి, కళాశాల విస్తృత ప్రభావానికి కృషిచేసిన ఏలూరుపాటి అనంతరామయ్య సేవలను వక్తలు శ్లాఘించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేఎస్ఎస్‌వీ ప్రసాద శర్మ, నడింపల్లి విజయ ప్రసాద్, డీవీఎన్ ధన్, డాక్టర్ పి.కోటిరత్నం, పసల బాబురావు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక పాతగుంటూరు ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో పలకలూరి రామతులశమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వృద్ధులు, దివ్యాంగులకు శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమాజ సేవకులు పలకలూరి శివరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి వృద్ధులను, అభాగ్యులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలకలూరి నాగేశ్వరరావు, పలకలూరి సుబ్బమ్మ, చేను వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో వైఎస్సార్ కంటివెలుగు

విశాలాంధ్ర-తాడేపల్లి : డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు అవ్వ-తాతల కార్యక్రమం మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో జరిగింది. ఉండవల్లి-1 సచివాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు ఉచిత వైద్యశిబిరంలో అవ్వ తాతలకి కంటి పరీక్షలు నిర్వహించారు. 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 15 మందికి కళ్ళజోళ్ల అవసరం అని గుర్తించగా, కంటి ఆపరేషన్ నిమిత్తం 9 మందిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు. ఇతర కంటి సమస్యలు ఉన్నవారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు ఉచితంగా ఇవ్వడం, కంటి ఆపరేషన్లను నిర్వహిస్తారని వారు తెలిపారు. కంటి వెలుగు పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ కర్ణ కంటి పరీక్షలు నిర్వహించారు. సచివాలయాల ఏఎన్ఎం ఏ.జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాధుల శుభ్రం

విశాలాంధ్ర-దుగ్గిరాల : ఈస్టర్ పండగ సందర్భంగా మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో శనివారం సమాధులను శుభ్రం శుభ్రం చేసి, సున్నం చల్లి, కొవ్వొత్తులు, సాంబ్రాణి కడ్డీలు వెలిగించి అలం కరణ చేశారు. నేడు సమాధిలో నుంచి యేసుప్రభు తిరిగి లేచి పునర్థా నులై బయటికి వస్తారని ఆశతో సమాధులు అలంకరణ చేస్తారన్నారు. అందరికీ ఈస్టర్ పర్వదినాన శుభాకాంక్షలు తెలియజేశారు. కాగితాల రాయప్ప, కాగితాల ప్రసన్న, కాగితాల ఇమ్మానియేల్, కాగితాల ప్రశాంతి, మండేపూడి బ్లెస్సి, కాగితాల ప్రసాదరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాతి గర్వించదగ్గ నాయకుడు వేములపల్లి శ్రీకృష్ణ

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : తెలుగు జాతి గర్వించదగిన నాయకుడు కామ్రేడ్ వేములపల్లి శ్రీకృష్ణ అని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కామ్రేడ్ వేములపల్లి శ్రీకృష్ణ 23వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ గతమెంతో ఘనకీర్తి గలవాడా... చేయెత్తి జై కొట్టు తెలుగోడా అని ఎలుగెత్తి చాటిన గొప్ప వ్యక్తి వేములపల్లి అని కొనియాడారు. కమ్యూనిస్టు నాయకుడుగానే కాకుండా ఆంధ్రప్రదేశ్ గర్వించదగిన నాయకుడిగా తన పాత్రను పోషించారని గుర్తుచేశారు. జలగం వెంగళరావు సీఎంగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నాయకుడు ఎలా ఉండాలో చూయించారని అన్నారు. రాజకీయ, ఆర్థిక అంశాలపై ఆయన చేసే ప్రతి ప్రసంగం, చేసే విశ్లేషణ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. గుంటూరు జిల్లా సీపీఐ కార్యదర్శిగా పనిచేసినప్పుడు జిల్లాలో దున్నే వాడికి భూమి కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం జరిగిన వీరోచిత పోరాటాలకు రూపకల్పన చేసి జిల్లాలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల ఉద్యమాన్ని ఒడ్డుకు తీసుకువెళ్ళిన మహానాయకుడు కామ్రేడ్ వేములపల్లి శ్రీకృష్ణ అని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జాతీయ సమితి సభ్యులుగా, శాంతి శ్రేయ సంఘాల జాతీయ కార్యదర్శిగా వివిధ హోదాలలో పనిచేశారని గుర్తుచేశారు. ఆయన పలు దఫాలు శాసనసభ్యునిగా పనిచేశారని, ఆ సమయంలో చేసిన అభివృద్ధి నేటికి దర్శనమిస్తుందన్నారు. సాహిత్యవేత్తగా, ఉద్యమకారుడుగా, ప్రతిపక్షనేతగా ప్రతిభ కనబరచిన ఆయన నేటి యువ కమ్యూనిస్టులకు స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై భవిష్యత్ పోరాటాలకు వేములపల్లి వర్ధంతి సందర్భంగా పునరంకితం అవుతామని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ తెలుగు వాడి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి వేములపల్లి శ్రీకృష్ణ అని, కమ్యూనిస్టుగా, ఎమ్మెల్యేగా ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలచిపోతాయన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, సీపీఐ నాయకులు రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, యశ్వంత్, నూతలపాటి వెంకటేశ్వరరావు, నాసర్ జీ, ఎస్‌కే వలి, సాయి, చినపోతుల శ్రీనివాసరావు, వెలువోలు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు ఖర్జూర పండ్లు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని గుంటూరు విభాగం జమాఅతే-ఇస్లామీ-హింద్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లోని గైనకాలజీ వార్డులో సుమారు 154 మంది గర్భిణీ, బాలింతలకు నాణ్యమైన ఖర్జూర పండ్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి శనివారం అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ ఖర్జూరపు పండ్లు బాలింతలకు బలాన్ని ఇస్తుందని, సమాజంలో ఉన్న పేదలను సహాయం చేయడంలో జమాఅత్ ఇస్లామీ హింద్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాఅతే ఇస్లామి హింద్ సంఘ సేవా కార్యవర్గ సభ్యులు అబ్దుల్ రషీద్, హాఫిజున్, సీమా, మీడియా కార్యదర్శి ముస్తఫా పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రోడ్డు ప్రమాదాల నివారణపై వచ్చే నెలలో గుంటూరులో అవగాహన కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు స్టాఫ్ స్పీడ్ సంస్థ నిర్వాహకురాలు బి.హిమబిందు తెలిపారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో ముస్తఫాను కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాఫ్ స్పీడ్ సంస్థ నిర్వాహకురాలు హిమబిందు మాట్లాడుతూ యువత ద్విచక్ర వాహనాలుపై ప్రయాణం చేస్తూ నిర్లక్ష్య ధోరణితో నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, దీంతో ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు వచ్చే నెలలో గుంటూరు నగరంలో ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు పట్ల యువతను అవగాహన కల్పించే కార్యక్రమాలు పట్ల తనవంతు కృషి ఉంటుందన్నారు. పోస్టర్ ఆవిస్కరణలో తూర్పు వైసీపీ నాయకురాలు నూరి ఫాతిమా, 1వ డివిజన్ కార్పొరేటర్ కామిరెడ్డి రంగారెడ్డి, వైసీపీ నాయకులు రాచమంటి భాస్కర్ తదితరులు ఉన్నారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు తెనాలిలో ఘన స్వాగతం

విశాలాంధ్ర-తెనాలి : భారత ప్రధాని నరేంద్రమోదీ శనివారం హైదరాబాద్‌లో ప్రారంభించిన హైదరాబాద్ టు తిరుపతి వందేభారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ రోజు సాయంత్రం 4.50గంటలకు తెనాలి చేరుకుంది. ఈ సందర్భంగా వందేభారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తెనాలి ఛైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్, కౌన్సిలర్లు, రైల్వే అధికారులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ నసీమ్ మాట్లాడుతూ ఈ రైలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా కాలం ఎంతో సేవ్ అవుతుందని చెప్పారు. ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రైల్వే డిపార్ట్‌మెంట్ ఇంత మంచి అవకాశాన్ని కల్పించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి నాయకులు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో ఇలాంటి వందేభారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, మున్సిపల్ కౌన్సిలర్లు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

విశాలాంధ్రతెనాలి : ఆపట్టణ నియోజివర్గంలో జగనన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ సారధ్యంలో కొనసాగించారు. పలు గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని పంచాయితీ సర్పంచులు, సభ్యులు, ప్రజలు, వైయస్సార్ సిపి నాయకులు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పలు వార్డులలో, గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి పాలనలో పేదలకు అందిచింన సంక్షేమ పథకాలను గతంలో దేశంలో ఏ ఒక్క నాయకులు కూడా అందించలేకపోయారని చెప్పారు. యావత్తు దేశం ఆంధ్రప్రదేశ్‌పై ఆశాభావంగా చూస్తుందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో ప్రజలు ఉత్సాహ భరితంగా ఉన్నారని చెప్పారు. 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతాయని వాటిలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని శివకుమార్ కోరారు. స్వయంగా పట్టణంలో ఇంటింటికి తిరిగి కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న పనిచేస్తున్నారని చెప్పారు. ఇంటింటికి తిరిగి జగన్ పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల అభిప్రాయాలను నమోదు చేసి స్మార్ట్ ఫోన్లలో యాప్ అప్‌లోడ్ చేసి, ఈరోజు కూడా స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల వద్ద అక్రమ డంపింగ్ నిలిపివేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : టిడ్కో గృహ సముదాయంలో తెలుగు మహిళ ఆధ్వర్యంలో శనివారం మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టిడ్కో గృహాలలో నివాసముంటున్న మహిళలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. టిడ్కో గృహాల వద్ద అక్రమంగా చెత్త డంపింగ్ చేస్తూ రాత్రి వేళలో నిప్పురాజేస్తున్నారని, దుర్గంధం, పొగతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంపింగ్ వలన దోమల బెడద పెరిగిందని తెలుగు మహిళ నాయకులు వద్ద పలువురు మహిళలు వాపోయారు. పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కలిపించలేదని, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, షాపులు, కమ్యూనిటీ హాలు, అంగన్వాడీ స్కూల్ నిర్మించి ఇవ్వాల్సి ఉన్న జాప్యం చేయడంపై తెలుగు మహిళా నాయకుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యవసర సరుకులు కరెంటు బిల్లులతో పలు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. టిడ్కో గృహ పరిసరాలలో చెత్త డంపింగ్ సమస్యపై గత నెలలోనే మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని అయినా సమస్య పరిష్కరించకపోవడంపై ఆరుద్ర భూలక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి వింజమూరి ఆశాబాల, నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఊట్ల దుర్గమల్లేశ్వరి, పట్టణ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి వాసా పద్మ, నియోజకవర్గ తెలుగు మహిళా కార్యదర్శి ఉద్దంటి పద్మావతి, పట్టణ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కానూరి నాగలక్ష్మి, పట్టణ తెలుగు మహిళా కార్యదర్శులు సారమేకల మాధవి, సింహాద్రి బేబి రాణి, నియోజకవర్గ అంగన్వాడి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి దివి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కొండవీటి వాగు పరిశీలించిన జనసేన నేతలు

విశాలాంధ్ర-తాడేపల్లి: ఉండవల్లి గుహలు వద్ద కొండవీటి వాగులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను జనసేన నేతలు శనివారం పరిశీలించారు. నాలుగు సంవత్సరాలుగా కొండవీటి వాగులో గుర్రపు డెక్క పేరుకుపోయిందని జనసేన నేతలు ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ గుర్రపు డెక్కను తొలగించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్కసారి కూడా ఈ గుర్రపు డెక్క ను శుభ్రం చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి రావి రామ, నియోజకవర్గ నాయకులు దాసరి శివ నాగేంద్రం, తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి శింగంశెట్టి శ్రీనివాసరావు, యువజన నాయకులు శింగంశెట్టి వెంకట్, గ్రామ ప్రధాన కార్యదర్శి పసుపులేటి జగదీష్, జనసైనికులు మారుతీ, శరత్ నాయుడు తదితరలు పాల్గొన్నారు.

ఓటు నమోదు అందరి బాధ్యత

విశాలాంధ్ర-తాడేపల్లి: ఓటరుగా నమోదు చేసుకోవటం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి బాధ్యత అని కెఎల్ విశ్వవిద్యాలయం విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు అన్నారు. శనివారం మంగళగిరి తాడేపల్లి కార్పోరేషన్ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో కెఎల్‌యు లా కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఓటు నమోదుపై ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎన్‌వీఎస్‌వీ పోర్టల్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా మొబైల్ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని, లేదా సమీపంలోని సచివాలయంలో కానీ మీ సేవా కేంద్రాలలో కానీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ సలహాదారులు డాక్టర్ హాబీబుల్లాఖాన్, డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్‌లు సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రోవైస్ ఛాన్స్ లర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, శాక్ డైరెక్టర్ పి.సాయివిజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ, అధ్యాపకురాలు కియాసర్కార్, సమన్వయకర్తలు పి.సురేష్, జి.చంద్రశేఖర్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా క్రీడాకారులకు వివిధ రకాల కిట్లు అదజేస్తున్నట్లు తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు తెలిపారు. తాడేపల్లి పట్టణం, 10వ వార్డులోని బాపనయ్యపేట వాలీబాల్ టీం సభ్యులలైన కె.అరుణ్, పి.కార్తీక్, కె.జశ్వంత్‌లకు నారా లోకేష్ సహకారంతో తాడేపల్లి పట్టణ నాయకులు శుక్రవారం కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ బాగా చదువుకోవడంతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపి తల్లిదండ్రులకు, జిల్లాకు పేరుప్రతిష్టలు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి దారాదాసు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి జుంజు మరియదాసు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి వడ్డెరశ్వపు స్టాలిన్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు జి.నాగేశ్వరరావు, టిఎన్ఎస్ఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి మాగంటి కళ్యాణ్, యువత నాయకులు రాజేంద్రప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆదివాసులపై వైమానిక దాడులను నిలిపివేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దండకారణ్యం ప్రాంతంలో ఆదివాసులుపై కేంద్ర ప్రభుత్వం వైమానిక బాంబు దాడులను తక్షణమే నిలుపుదల చేయాలని పౌర హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. దండకారణ్యం ప్రాంతంలో విలువైన ఖనిజాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టేందుకే మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆదివాసులను నిర్వాసితులను చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వైమానిక దాడులు చేసి చంపేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో ఆంధ్రప్రదేశ్ శాఖ 'ఆదివాసులుపై వైమానిక దాడులు-విజయ నిర్ధారణ-కర్తవ్యాలు'అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2024 కల్లా మావోయిస్టుల అంతం చేస్తామని ప్రకటించిన రోజు నుంచి నేటి వరకు ప్రతిరోజూ ఆదివాసి రైతులపై డ్రోన్‌లు, విమానాల నుంచి ఆదివాసి రైతులుపై బాంబులు వేసి నిర్మూలించే దిశగా ఉండటం దారుణమన్నారు. శత్రు దేశంపై యుద్ధం చేసేటప్పుడు కూడా ఇలాంటి బీభత్సకరమైన దాడులు గతంలో ఎన్నడూ చూడలేదని, ఆదివాసులు, గిరిజనులను అడవుల నుంచి ఖాళీ చేయించి కోటాను కోట్ల రూపాయల విలువైన ఖనిజాలను బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం అత్యంత దారుణమని దుయ్యబట్టారు. ఈ సదస్సుకు పోరాకుల సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు, విరసం నాయకులు పాణి, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు అంజమ్మ, ప్రజా కళామండలి నాయకులు జె.కోటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'వీనస్ స్కూల్' వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక డొంక రోడ్డులోని వీనస్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడకలు స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా జరి గాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహాత్మా గాంధీ కాలేజ్ ప్రిన్సిపల్ డి.ఎ.ఆర్ సుబ్రమణ్యం, డాక్టర్ కొత్తమాసు దినేష్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యా ర్థులు చదువుతో పాటు గురువులు చెప్పే ప్రతి మాటను శ్రద్ధగా విని పాటించాలని సూచించారు. స్కూల్ డైరెక్టర్ శివరామకృష్ణ, ప్రిన్సిపల్ కె.కల్పన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నర్సరీ నుండి పదవ తరగతి వరకు క్రమశిక్షణతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో, చక్కటి విద్యా ప్రణాళికతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా విద్యను అందించడం జరుగుతుందని వివరించారు. తమ విద్యా సంస్థ ఎదుగుదలకు కీలక పాత్ర పోషిస్తున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకఅధ్యాపకేతర సిబ్బం దికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పలు విభాగాలలో విజే తలుగా నిలచిన విద్యార్థులకు ముఖ్యఅతిధులు బహుమతులు అందజేశారు.

సీపీఐ, సీపీఎం సంయుక్త ప్రచార భేరీ

విశాలాంధ్ర-తుళ్లూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం సంయుక్తంగా ప్రచార భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి అన్నారు. శనివారం తుళ్లూరులో నేతలు మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సిపిఐ, సిపిఎంల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరగనున్న ప్రచార బేరి కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 14న తుళ్లూరులో ప్రారంభించనున్నట్లుగా తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వలన అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం సామాన్యులపై భారాల మీద భారాలు వేస్తూ, దేశ సంపదనంతా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని అన్నారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టి ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తుందని అన్నారు. మరో ప్రక్క రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి, మోడీకి అనుకూలంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రజానీకంపై విద్యుత్ చార్జీలు, చెత్త పన్ను ,ఆస్తి పన్ను పెంచి భారాలు వేస్తుందని అన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబురావు, ఎర్రమనేని శ్రీనివాసరావు, గడ్డం కృష్ణ, షేక్ జానీ, కుంభ ఆంజనేయులు, పాబత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చట్ట సభల ప్రతిష్ట మంటగలిసిపోయింది

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆందోళనలు, అవాంతరాలు, వాయిదా పర్వాలతో దేశ వ్యాప్తంగా చట్ట సభల ప్రతిష్ట మంట గలిసిపోయిందని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టి.నారపరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'మొక్కుబడి తంతులుగా మిగిలిపోతున్న చట్ట సభల భేటీలు'అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నారపరెడ్డి మాట్లాడుతూ చట్ట సభలకు ప్రభుత్వాలు జవాబుదారీ కావాల్నదే పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రమని, అయితే ప్రజాస్వామ్యానికి పుట్టినిగడ్డగా పాలకులు ప్రకటించుకున్న భారత్‌లో అందుకు భిన్నంగా జరుగుతుందన్నారు. విద్యావేత్త సింగరయ్య మాట్లాడుతూ అర్ధ వంతమైన చర్చలకు ఆస్కారం లేకుండానే 45లక్షల కోట్ల కేంద్రం పద్దుకు ఉభయ సభలు ఆమోద ముద్ర వేయటం, యావద్భారతాన్ని విస్మయపరిచిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నేత సీహెచ్.సత్యన్నారాయణ, కొండా శివరామిరెడ్డి, చలమారెడ్డి, రవిబాబు, ఇందుశేఖర్ తదితరులు ఉన్నారు.

సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర

విశాలాంధ్ర-పొన్నూరు: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు, ప్రైవేటీకరణ విధానాలకు నిరసనగా ఈ నెల 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రలకు మద్దతుగా ప్రజలను చైతన్యపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 10, 11, 12 తేదీలలో గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో జరిగే రచయితలు, కళాకారుల వర్క్‌షాపులో పాటలు, నాటికలు, స్కిట్స్, నృత్యరూపకాలు తయారు చేయబడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. ఈ రాష్ట్ర వ్యాప్త వర్క్‌షాపులో కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు జంపని గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసమే టీడీపీ పోరాటం

విశాలాంధ్ర- ఫిరంగిపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు సమాజంలో కనీస సామాజిక న్యాయం పొందలేని దుస్థితికి చేరిందని, సామాజిక న్యాయ పోరాటం కోసమే చైతన్య పాద యాత్ర చేస్తున్నామని తాడికొండ టిడిపి మాజీ ఎమ్మెల్యే మరియు గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలో ప్రారంభమైన సామాజిక న్యాయ చైతన్య పాద యాత్ర మూడో రోజుకు చేరింది. శనివారం జరిగిన పాద యాత్ర మండలంలోని పొనుగుపాడు గ్రామంలో ప్రారంభమై మేరికపూడి మీదుగా నుదురుపాడు, వేమవరం, కండ్రిక గ్రామాల్లో సాగిన పాద యాత్రలో శ్రావణ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అకృత్యాలకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు మండవ నర్సింహారావు సారధ్యంలో కొనసాగుతున్న పాద యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

జగన్‌తోనే భవిష్యత్

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పథకాల వల్లే తమ భవిష్యత్తు బాగుంటుందని నమ్ముతున్నట్టు ప్రజలు చెబుతున్నారని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు మండల పరిధిలోని 75 తాళ్లూరులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగనన్న పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లుగా కులం, మతం, పార్టీలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అందుకే జనం జగన్‌ను గుండెల్లో పెట్టుకున్నారన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఈద సాంబిరెడ్డి, మీరయ్య మస్తాన్ షరీఫ్, కల్లి శ్రీనువాస రెడ్డి, వజ్జా రాధ, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పరీక్ష కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-గురజాల: నియోజకవర్గ కేంద్రం గురజాలలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో తహశీల్దారు దానియేలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పరీక్షలు నిర్వహించే సెంటర్‌లో గల మౌలిక సదుపాయాలను పర్యవేక్షించి పరీక్షలు నిర్వహించు సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎటువంటి అవకతవకలకు జరగకుండా పారదర్శకతతో పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

అంగన్వాడి కేంద్రం సందర్శన

విశాలాంధ్ర-వినుకొండ: విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాముల కాలనీలో అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడి కేంద్రంలో అవసరమైన ఫ్యాన్, రైస్ కుక్కర్ చిన్నారులకు స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. సంఘ సభ్యుల సహకారంతో ఇకముందు కూడా ఇదే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. చిన్నారులు చక్కగా చదువుకొని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సేవా సంఘం సభ్యులు సుబ్బయ్య శర్మ, నాగేంద్రుడు, రామలింగేశ్వరరావు, సుందర రావు, జోజయ్య మరియు అంగనవాడి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-పెదకూరపాడు : మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కాకతీయ డిగ్రీ కాలేజీలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కాటూరి మెడికల్ హాస్పిటల్ వారి సహకారంతో, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కాటూరి మెడికల్ కాలేజ్ వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 586 మంది ఓపీలు చూశారు. ముందుగా మాగులూరి ఫౌండేషన్ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాగులూరి హరిబాబు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కృష్ణారావు, కిరణ్, అర్తిమళ్ళ రమేష్ ప్రసాద్, సిద్దయ్య, సుబ్బారావు, రామారావు, వెంకట్రామిరెడ్డి, ఏపూరి నాగేశ్వరావు, ముంతాజ్, వడ్లమూడి అప్పారావు, గల్లా బాబురావు, బెల్లంకొండ రామగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఆశ్రమ ఆస్తులను అక్రమంగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తు లపై తగిన చర్యలు తీసుకోవాలని ఆశ్రమ వంశపారంపర్య దర్మకర్త చింతాడ లలితాంబ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసారు. ఆశ్రమానికి రిజిస్టర్ కాబడిన భూమిలో కొంతభాగం ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు రిజిస్టర్ కార్యాలయంలో కట్టమూరి విజయ వెంకట లక్ష్మి నరసింహారావు, పెద్దిరెడ్డి గోవిందరెడ్డి, పెద్దిరెడ్డి మంగమ్మ, పెద్దిరెడ్డి దీపిక, కల్లి అంజిరెడ్డిలు కలసి కుట్రపూరితంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ఆశ్రమంలోనికి అక్రమంగా ప్రవేశించేందుకు జిల్లా అధికారులకు సైతం తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఆశ్రమ నిర్వాహకులపై దౌర్జన్యం చేస్తూ ఆశ్రమాన్ని ఖాళీ చేయాలని లేనిపక్షంలో చంపుతామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో కూడా ఆశ్రమ ఆస్తులను కొంతమేర ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఆక్రమణదారుల నుంచి తమకు రక్షణ కల్పించి ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రముఖ పారిశ్రామికవేత్త, గొప్ప మానవతావాది సామినేని కోటేశ్వరరావు పేద మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కొనియాడారు. ఈ మేరకు శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, సామినేని ఛారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో గుంటూరు జిల్లాలోని బోయపాలెం వద్ద గల స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 300 మంది మహిళలు వివిధ గ్రామాల నుండి విచ్చేసి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ వారి వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పేదరికం అత్యధికంగా ఉన్న భారతదేశంలో ధాతృత్వం గల మహనీయులు ఎందరో అవసరమన్నారు. సేవా రంగంలో ఉండవలసిన విద్య, వైద్య రంగాలు కార్పొరేటీకరణ కావడం వలన పేద వర్గాలు దోపిడీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కాటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లంకా రఘురామిరెడ్డి, డాక్టర్ కందిమళ్ల వాసు, డాక్టర్ హిమనీ, రోటరీ సంస్థ నేతలు అంజిరెడ్డి, కందిమల్ల అంజిబాబు, గల్ల సాంబశివరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, సామినేని ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హఠావో.. దేశ్ బచావో
ప్రచార యాత్రను జయప్రదం చేయండి

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్

విశాలాంధ్ర-నరసరావుపేట : సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు ఏప్రిల్ 14 రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబద్కర్ జయంతి నుంచి 30వ తేదీ వరకు పల్నాడు జిల్లాలో సీపీఐ, వామపక్ష పార్టీల అధ్వర్యంలో చేపడుతున్న బీజేపీ హటావో-దేశ్‌కో బచావో ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన నియోజకవర్గ సీపీఐ సమితి సమావేశంలో ఆచప మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం రాజ్యాంగాన్ని రక్షించడం కోసం, మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడటం కోసం, అధిక ధరా భారాలతో అల్లాడిపోతున్న ప్రజానీకాన్ని చైతన్యవంతం చేసి పోరాటాలకు సిద్ధం చేయడం కోసం, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను ఇంటికి సాగనంపడం కోసం జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటింటి ప్రచార యాత్రలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం నియంతృత్వ విధానాలతో దేశంలో ఉన్న బీజేపీయేతర ప్రభుత్వాలపై ఉక్కుపాదం మోపుతూ గవర్నర్లతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను అనేక ఇబ్బందులుపెడుతూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ చట్ట ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులు విడుదల చేయకుండా అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీల ప్రకారం రావలసిన నిధులను ఇవ్వకుండా, పోలవరం ప్రాజెక్టు పనులను ముందుకు సాగనీయకుండ, రాష్ట్ర అభివృద్ధికి, రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులను విడుదల చేయకుండా మోకాలడ్డుతూ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసే విధానానికి పూనుకుందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్ కంపెనీలకు బడా పెట్టుబడిదారులకు అమ్మ చూపుతోందని, అలాగే దేశంలోనే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, ఆదాని లాంటి వారికి ఉపయోగపడే విధంగా సముద్ర తీర ప్రాంతాలు, పోర్టులు, బొగ్గు గనులు, ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలందరూ గత రెండేళ్లుగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాడుతుంటే ఏమాత్రం వెనుకకు తగ్గని కేంద్రం ప్రైవేటీకరణ వైపు ముందుకు అడుగులు వేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ధరలు మొత్తం తగ్గిస్తానని నల్లధనాన్ని వెనక్కు తీసుకొస్తానని రైతాంగానికి రెట్టింపు ఆదాయం చేస్తానని సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, ప్రతిఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ మాటలు నీటి మూటలయ్యాయని అన్నారు. దేశంలోని ప్రజానీకం అధిక ధరాభారాలతో అల్లాడిపోతున్నారని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి తమాషా చూస్తున్నారని మారుతీ విమర్శించారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 25 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని అందరికీ ఉద్యోగాలు వస్తాయని, రాష్ట్రానికి అమరావతి రాజధానిగా ఉంటుందని రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని, ప్రత్యేక హోదా కోసం కేంద్రం మెడలు వంచుతానన్న జగన్‌మోహన్ రెడ్డి 32 మంది ఎంపీలు ఉన్నప్పటికీనీ ఢిల్లీ పెద్దల ముందు సాగిల పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజలపై అధిక పన్నుల భారాలు మోపుతూ ఆర్టీసీ బస్సు చార్జీలు కరెంటు చార్జీలు ఇంటి పన్నులు, నీటి పన్నులు చివరకు చెత్త పన్నులు కూడా పెంచి ప్రజలు నడ్డి విరిగే విధంగా పన్నుల భారాలు మోపారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులు తేలేక కేంద్రాన్ని నిలదీయలేక రాష్ట్ర అభివృద్ధి నిధులు అడగలేక కేంద్రం ముందు చతికిలబడ్డారని అన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న టిట్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని, జగనన్న కాలనీల పేరుతో ఏ ఒక్క పేదవారికి ప్రభుత్వ పరంగా ఇల్లు కట్టి ఇవ్వలేదని విమర్శించారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వమే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన తాండవిస్తోందని ఎదిరించిన వారిపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ జైల్లో వేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ అక్రమ కేసులపై నిర్బంధాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కంటక ప్రజా వ్యతిరేక రాజ్యాంగ విరుద్ధ విధానాలపై ప్రజలు కార్మికులు కష్టజీవులు రైతాంగం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమితి సమావేశానికి ఎస్.దేవి అధ్యక్షత వహించగా సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకు జరిగే వామపక్షాల ప్రజా చైతన్య యాత్రలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, రొద్ద అంజిరెడ్డి, ఎస్.దేవి, చిట్యాల శ్రీనివాస రెడ్డి, అచ్యుత రెడ్డి, యు.రాజు, త్రిపురాపురం సాంబయ్య, వెంకయ్య, నాగేశ్వరరావు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

13న అమరవీరుల సంస్మరణ సభ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : అమర వీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, ప్రజాపోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ తెలిపారు. ఈ నెల 13వ తేదీ తుమ్మలపాలెంలోని అమర్‌నగర్‌లో నిర్వహించే అమరవీరుల స్మారక సభ కరపత్రాలను పార్టీ నాయకులతో కలసి సీపీఐ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. తెలంగాణా పోరాటకాలంలో నిజాం వ్యతిరేక పోరాటానికి వెన్ను దన్నుగా సాగిన మన ప్రాంత వీరత్వానికి ప్రతీకలైన ఆరుగురు యోధుల్ని తుమ్మలపాలెం సమీపంలో కాల్చిచంపారని, వారితోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ క్రూరత్వానికి గురై చనిపోయిన మొత్తం 17 మంది వీరుల స్మృతిలో తుమ్మలపాలెంలో స్మృతి చిహ్నాలు ఏర్పాటు చేసుకున్నా మన్నారు. ఆ తర్వాత కాలంలో జరిగిన శ్రీకాకుళం గిరిజన ఉద్యమానికి బాసటగా నిల్చిన మన జిల్లాకు చెందిన 10 మంది అమరుల జ్ఞాపకార్థం మరో స్థూపం నిర్మించబడినందని తెలిపారు. మళ్ళీ 1997 ఈ కట్టడాల్ని పునఃనిర్మించి అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా ఇక్కడ స్మారక సభల్ని జరుపుతున్నాయని వివరించారు. దేశ సమైఖ్యత, భూ సంస్కరణలకు కమ్యూనిస్టు ఉద్యమమే కారణమని గుర్తుచేశారు. రాజ్యాంగ వ్యవస్థలను మార్చాలని బీజేపీ భావిస్తోందని, ప్రజాస్వామిక వాదులు ఐక్యంగా ప్రతిఘటించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని, సహజ వనరులను కొల్లగొడుతోందని, ఒకే దేశం, ఒకే మార్కెట్ పేరుతో దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, నాయకులు ఆరాధ్యుల రామకృష్ణ, నాయుడు శివ, ఎం.వెంకటేశ్వర్లు, బొంతా భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్

విశాలాంధ్ర-శావల్యాపురం: జగన్మో హన్ రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్క రణలు తీసుకొచ్చి ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు సుపరిపాలన అందిస్తోందని, ఆ సంస్కరణల ఫలాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి, ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వారు పొందిన లబ్ధిని వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపిపి ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని వేల్పూరు పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఎంపిపి ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, సొసైటీ ఛైర్మన్ నాగులపాటి చెన్నయ్యలు సంయుక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ నినాదంతో ప్రతి ఇంటికెళ్లి బుక్‌లెట్ అందించి, ఇంటి తలుపులకు, సెల్ ఫోన్లకు స్టిక్కర్ అంటించి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు తుమాటి కబ్బారావు, సచివాలయ కన్వీనర్ మాదాల నాగేశ్వరరావు, కోఆర్డినేటర్ జవంగుల బాబు, వైయస్సార్ సిపి నాయకులు కూడా స్వర్ణాల వెంకట్రావు, ముంద్రు సాంబశివరావు, సూరాబత్తుని బ్రహ్మయ్య, నాగులపాటి శ్రీనివాసరావు, సురాబత్తుని కృష్ణారావు, రంతు శివ, తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరడం శుభపరిణామం

విశాలాంధ్ర-వినుకొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారికిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలో చేరడం శుభ పరిమాణం అని, ఆయన చేరిక వల్ల ఆంధ్రప్రదేశ్లో బీజేపీ ఎక్కువ బలోపేతం అవుతుందని, వారి చేరికను వినుకొండ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ స్వాగతిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ యార్లగడ్డ లెనిన్ కుమార్, జిల్లా భారతీయ జనతా పార్టీ ఉద్యమ కమిటీ మెంబర్ మేడం రమేష్ ఓ ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. వారితో పాటుగా పల్నాడుజిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి ఎండ్లూరి వీరయ్య, శావల్యాపురం మండల బిజెపి కార్యదర్శి పూలేటి పేరయ్య, నియోజకవర్గ ఓబిసి మోర్చా కన్వీనర్ పాలడుగు రాజు యువమోర్చా నాయకుడు కల్వకుంట జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం : అరవిందబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: టిడ్కో గృహాల లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని టీడీపీ ఇంచార్జీ డాక్టర్ అరవింద బాబు అన్నారు. పట్టణ పరిధిలోని టిడ్కో సముదాయాలను డాక్టర్ అరవింద బాబు అధ్వర్యంలో శనివారం టిడిపి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా అరవింద బాబు సెల్ఫీ తీసి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి చాలెంజ్ విసిరారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో 1504 టిట్కో గృహాలు నిర్మించామని ఆ గృహాలకు టీడీపీ ప్రభుత్వంలోనే మౌలిక సదుపాయాల కల్పన జరిగిందన్నారు. నరస రావుపేటలో నిర్మించిన 1504 టిట్కో గృహాలకు లబ్ధిదారులు తమ వాటా రూ.50వేల రూపాయలు చెల్లించారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక లబ్ధిదారుల పేర్లు మార్చి 400 మంది వైసీపీ కార్యకర్తలకు అక్రమ మార్గం ద్వారా ఇల్లు కట్టబెట్టడానికి ప్రయత్నించడాన్ని చదలవాడ తప్పు పట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ పేదలకు టిడ్కో గృహాలు నిర్మించామని నాలుగేళ్ల వైసిపి పాలనలో పేదలకు ఎన్ని పక్కా ఇల్లు నిర్మించారో చెప్పే దమ్ము ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి ఉందా అని సెల్ఫీ సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల సింహాద్రి యాదవ్, బండరుపల్లి విశేశ్వర్ రావు, కొల్లి బ్రహ్మయ్య, కడియం కోటి సుబ్బారావు, అల్లంశెట్టి మోహన్ రావు, పొత్తూరి శ్రీనివాస్ రావు, తిరుమలశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణం కాంగ్రెస్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర-మాచర్ల: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ఎరమల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టులు కట్టడం, పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించడం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో ఉపాధి కరువై ప్రజలు అల్లాడుతున్నారన్నారు. టీడీపీ, వైసీపి, జనసేన పార్టీలకు ఓటు వేస్తే బిజెపికి ఓట్లు వేసినట్టేనన్నారు. పార్టీలు బిజెపితో అంతర్గత ఒప్పందాలు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైసీపి, జనసేన టీడీపీల పనితీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీడీపి, వైసీపిల పాలనలో ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే నిలిచిపోయాయని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ పాలన వంటి సుభిక్షమైన పరిపాలన మళ్లీ ప్రజలు చూడాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో చిమటా వెంకటేశ్వర్లు, జీవి సత్యనారాయణ దళిత నాయకులు ఆదాం, రాగిడి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం సాయంత్రం గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. గుంటూరు నగరానికి మొదటిసారి విచ్చేసిన ఈ రైలును చూసేందుకు విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఈ సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ రాజులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వందే భారత్ రైలు సికింద్రాబాద్ నుంచి గుంటూరు మీదగా తిరుపతికి రావడం సంతోషంగా ఉందని అన్నారు. అత్యంత వేగంగా నడిచే వందే భారత్ రైళ్ళను ఏపీకి రెండింటిని ఇప్పటికే కేటాయించిన ప్రధానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వందే భారత్ రైలు సామాన్యుడి నుంచి ధనవంతుడు వరకు ఉపయోగించుకొనే విధంగా ఉందని అన్నారు. స్వాగతం పలికిన వారిలో తోట రామకృష్ణ, రాచమల్లు భాస్కర్, కుమార్ గౌడ్, అప్పిశెట్టి రంగా, ఈమని మాధవరెడ్డి, భీమినేని చంద్రశేఖర్, వనమా నరేంద్ర, కొక్కెర శ్రీనివాస్, మంత్రి సుగుణ, రేణుకాదేవి, ఏలూరి లక్ష్మి, రావూరి లక్ష్మీ, తుల్లిమిల్లి రామకృష్ణ, పద్మనాభం, ప్రసాద్, రాజేష్ నాయిడు, సుధాకర్, నాగుల్ మీరా, అంకాల శ్రీను, తోట శ్రీనివాసరావు, సురేష్ జైన్ పోతురాజు వెంకట్, శేషగిరి, సుబ్బారావు, తాడువాయి రామకృష్ణ, రామచంద్రరావు, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-రెంటచింతల: స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో రాబోయే విద్యాసంవత్సరంలో చేరేందుకు ఆసక్తికల్గిన బాలుర నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్ తెలిపారు. ఈ నెల 8 నుండి 29 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామనీ 29న ప్రవేశ పరీక్ష ఉంటుంది. అర్హత సాధించిన వారికి 5లో 40 మందికి, 6లో ముగ్గురికి, 9లో పది మందికి రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఆయా సామాజిక వర్గాలకు సీట్లు కేటాయింపు ఉంటుంది.

గ్రామీణ యువతకు కార్ డ్రైవింగ్ శిక్షణ

విశాలాంధ్ర-పెదకూరపాడు : పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గ గ్రామాలలోని పేద యువకులకు అభయ ఫౌండేషన్, హైదరాబాద్ వారి సహకారంతో జన చైతన్య సమితి పెదకూరపాడు ఆధ్వర్యంలో ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దాసరి విజయ్ బెన్ని బాబు, వెలితోటి అనిల్ కుమార్లు తెలిపారు. పెదకూరపాడులో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సత్తెనపల్లిలోని శ్రీభవాని కారు డ్రైవింగ్ స్కూల్‌లో ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. 20 రోజులు డ్రైవింగ్ 10 రోజుల థియరీ శిక్షణా తరగతులు కలిపి 30 రోజులపాటు జరుగుతాయని వారు తెలిపారు. కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చిన తర్వాత ఎల్ఎల్ఆర్, లైసెన్స్ సర్టిఫికెట్స్ అందిస్తారని వివరించారు. ఆసక్తి కలిగిన 19నుంచి 35 సంవత్సరాల యువకులు అర్హులని వారికి ఇంటర్మీడియట్ లోపు విద్య అర్హత ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మార్క్ లిస్టు, నాలుగు పాస్‌పోర్ట్ ఫొటోలతో సత్తెనపల్లిలోని భవాని డ్రైవింగ్ స్కూల్లో దరఖాస్తుతో పాటు డాక్యుమెంట్లను జతపరిచి ఇవ్వాలని అన్నారు. దరఖాస్తుదారులందరికీ సత్తెనపల్లిలోని ప్రగతి నగర్ పార్క్ రోడ్డులో ఉన్న సాయి గాయత్రి ధ్యాన మందిరంలో ఈ నెల 12వ తేదీ ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఎంపికైన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500లు అభయ ఫౌండేషన్ హైదరాబాద్ వారికి చెల్లించాలని శిక్షణ పూర్తి చేసుకున్న తదుపరి తిరిగి ఆ రూ.500లు ఇవ్వబడుతుందని వారు వివరించారు. వివరాలకు 9440450422, 8886777767 అనే నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న'కు అనూహ్య స్పందన

విశాలాంధ్ర-నరసరావుపేట: పట్టణంలోని వార్డుల్లో నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని 19 వార్డు రామిరెడ్డి పేట, 31వ వార్డు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గోపిరెడ్డి శనివారం గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ వారి సమస్యలను, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల పనితీరులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి జగనన్న స్టిక్కర్లను అంటించి, వారి వివరాలను సమోదు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనపై తమ అభిప్రాయాన్ని తెలియజేస్తూ పార్టీ టోల్ ఫ్రీ నెంబర్‌కు మిస్ కాల్ ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేస్తున్న తమ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గం వైసిపి పరిశీలకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, వైసిపి వార్డ్ ఇన్చార్జీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అమరావతిలో 144 సెక్షన్

విశాలాంధ్ర-అమరావతి: పట్టణంలో శనివారం రాత్రి 9 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరస్వామి తెలిపారు. ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో 144 సెక్షన్ అమలుకు సహకరించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే నంబూరు శంకరావు అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాళ్లు విసురుకున్న నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఆదివారం అమరలింగేశ్వర స్వామి సాక్షిగా చర్చకు నేతలు సవాల్ విసర దంతో పోలీసులు ప్రత్యేక బలగాలను దింపారు.

దాహార్తి తీర్చడమే శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ ధ్యేయం

విశాలాంధ్ర-వినుకొండ: ప్రజలు, పాదచారుల దాహార్తి తీర్చడమే శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్య క్షులు. శివశక్తి లీలాంజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం ఆర్.టి.సి సెంటర్ శివయ్య స్తూపం అరుణ హోల్ ముళ్ళమూరు బస్టాండ్ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన మంచి నీటి చలివేంద్రాలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గత 30 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మెప్పు పొందుతున్నామని అన్నారు. గత 25 ఏళ్లుగా ఫౌండేషన్ ద్వారా ఉచిత కంటి పరీక్షలు ఆపరేషన్లు అన్నదాన కార్యక్రమాలు ప్రజలకు ఉచిత తాగునీటి సరఫరా వంటి కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామన్నారు. వినుకొండ అతిపెద్ద నియోజకవర్గం కాగా సుమారు 200 గ్రామాల ప్రజలు ప్రతిరోజు పలు పనులపై వేలాది మంది పట్టణానికి వచ్చి వెళుతుంటారని ఆ సందర్భాలలో వారు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా ప్రతి ఏడాది ఆ సెంటర్లలో మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు స్వచ్ఛమైన చల్లటి ఫిల్టర్ వాటర్ సరఫరా చేస్తున్నామన్నారు. కాగా శివశక్తి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలపై. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అసూయతో విషం కక్కుతున్నాడని జీవీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాగునీటి పథకానికి 159 కోట్లు మంజూరు చేయించానని అయితే ఎన్నికల కోడ్ రావడంతో అప్పుడు ఆ పథకం పనులు నిలిచిపోయాయన్నారు. ఆ పథకం ద్వారా ముగచింతలపాలెం డీప్ కట్ నుండి పైప్లైన్ ద్వారా పట్టణంలోని సింగర చెరువుకు నీళ్లు రప్పించి చెరువు నింపితే ఆరు మాసాల వరకు పట్టణ ప్రజలకు మంచినీరు సరిపోతూ వస్తుందని జీవీ గుర్తు చేశారు. పచ్చని చెట్లు పెంచాల్సింది పోయి. ఉన్న చెట్లను ముఖ్యమంత్రి నరుకుతున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణారావు, పి.పి.సురేష్ బాబు, పత్తిపూర్ణ చంద్రరావు, పల్లమీసాల దాసయ్య,పెమ్మసాని నాగేశ్వరరావు, దాసరి కోటేశ్వరరావు, మన్నెయ, రావూరి నారాయణ, సుంకర శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత జాని, సిద్దరపు ఫరిదు, బత్తుల గోవిందరాజులు, గోల్డ్ కరిముల్లా ఫరీద్ ఖలీల్ రియల్ ఎస్టేట్ జానీ ఫారుక్ వీరగంధం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
EP 56/2019 In O.S. 162/2014
బిట్వీన్ :
పాలువాయి హనుమంతరావు - D.H.R
మరియు
తుల్లిబిల్లి వెంకటేశ్వర్లు - J.D.R
పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం J.D.R కు చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని డి.12-04-2023వ తేదీన గం॥ 10.30ని॥ల నుండి పై వారి కోర్టులో బహిరంగ వేలము జరుగును. కావున కావలసిన వారు పై కోర్టులో హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా పిడుగురాళ్ళ S.R.O పరిధిలో మాచవరం మండలం, పిల్లుట్ల గ్రామము & గ్రామ పంచాయితీ, పిల్లుట్ల డి.నెం :127, AC 3.32 1/2 సెంట్లలో AC 2.07 1/2 సెంట్ల భూమికి హద్దులు. తూర్పు : నంద్యాల నరిసిరెడ్డి గారి స్థలం దక్షిణం : శరణాలయం స్థలం పడమర : శరణాలయం స్థలం ఉత్తరం : తుల్లిబిల్లి సాంబశివరావు స్థలం ఈ హద్దుల మధ్య గల AC 2.07 1/2 సెంట్ల మెట్ట స్థలం,
D.H.R విలువ 6,00,000/-
అమీనా విలువ 13,00,000/-
ఫర్దర్ హియరింగ్ : 19-04-2023
వేలం తేది : 12-04-2023
EC దాఖలా చైతన్య గోదావరి గ్రామీణబ్యాంకు, మోర్జంపాడు వారి తాకట్టుకు లోబడి
" By Oreder of the Court "
M/s. VANAMA VENKATA SUBBARAO
MUPPURI ANANTHA LAKSHMI
Advocates Brahmanapalli
Dt : 6-4-23

మహారాజశ్రీ గౌరవనీయులైన 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో గుంటూరు.
ఓ.యస్. నెం. 77/2021
Between :
పురం గౌరమ్మ - వాది
వర్సెస్
1) అందెల ప్రసాద్ S/o. కోటి వీరయ్య, వయస్సు 62సం॥లు, హిందువు, నివాసము డోర్ నెం.6-64, చామర్రు గ్రామము, అచ్చంపేట మండలం-522 409, సెల్ :996637705, 9989871532.
2) గడికోట @ గండికోట వెంకట కళ్యాణి
3) గడికోట @ గండికోట వెంకటేశ్వర్లు S/o. పోతురాజు, వయస్సు 57సం॥లు, హిందువు, డోర్ నెం. 7-180, చామర్రు, అచ్చంపేట మండలం
4) గడికోట @ గండికోట కోటేశ్వరరావు @ కోటయ్య S/o. పోతురాజు, వయస్సు 60సం॥లు, హిందూ, డోర్ నెం. 7-180, చామర్రు, అచ్చంపేట మండలం, - 522409 - ప్రతివాదులు
నోటీసు
ఈ దావాలోని వాది, దావా షెడ్యూలు దాఖలా స్థిరాస్తులపై యజమాన్యపు హక్కును ప్రకటించమని దర్శిలా దావా షెడ్యూలు భూములను స్వాధీనపరచమని పై నెంబరులో దావా వేసి అందలి 1,3 & 4 ప్రతివాదులైన మీకు అనేక పర్యాయములు కోర్టు నుండి సమన్లు జారీ చేయించినసూ తీసికోకుండా తిరుగుతూ భూమిని అన్యాక్రాంతము చేయుటకు ప్రయత్నించుచున్నారు. అందువలన శ్రీ కోర్టువారు ఈ పత్రికా ముఖంగా సమన్లు జారీ చేసియున్నారు. కనుక 1,3&4 ప్రతివాదులైన మీరు డి.24-04-2023 ఉదయం గం॥ 10.30ని॥లకు పైన తెల్పిన కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియ పరుచుకోవలసినది. లేనిచో మీ పరోక్షములో దావా తీర్మానించబడునని తెలియపరచటమైనది.
వాయిదా తేది : 24-04-2023
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
సాంబశివరావు కొండా, M.A., LL.M.
డి. వెంకయ్య,
గుంటూరు,
02-04-2023 వాది తరుపు న్యాయవాదులు

12న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ఈ నెల 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభ్యుల సమావేశం జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జెల్డి బాగ్యశ్రీధర్ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావలని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘ సభ్యత్వాలు, మండల మహాసభలు, జిల్లా మహాసభల నిర్వహణ తేదీల ప్రకటన, జిల్లా నూతన నాయకత్వ ఎన్నిక జరుగుతుందని శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సీనియర్ నాయకులు పమిడిబోయిన రామాంజనేయులు, కంచర్ల రాజు పాల్గొన్నారు.

120 మందికి ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని నక్కబొక్కలపాడు గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొర్రపాటి సుబ్రహ్మణ్యం 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించరు. వీరికి రోటరీ క్లబ్ వారు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళ్ళజోళ్ళు అవసరమైన ఉచితంగా కళ్ళజోళ్ళు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి దూళిపాల బులిరామయ్య మాట్లాడుతూ నేడు అనేక గ్రామాలలో వృద్ధులు కంటి సమస్యలతో బాధపడుతున్నారని అలాంటి వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు,కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొర్రపాటి కాజారావు,సెక్రెటరీ కుర్ర వెంకటరామయ్య, ఇంటూరి ఆంజనేయులు, జాస్తి సాంబశివరావు, కోటేశ్వరరావు,రవి అంకమ్మ చౌదరి, హుస్సేన్, నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర - మార్టూరు : రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో శనివారం బాలికలకు పౌష్టికాహారం పంపిణీ జరిగింది. మండలంలోని రాజుపాలెం గ్రామం నందు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 40 మంది బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేసి వారు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కే కాజారావు మాజీ అధ్యక్షులు ఇంటూరి ఆంజనేయులు జాస్తి సాంబశివరావు కోటేశ్వరరావు అనురాధ రావి అంకమ్మచౌదరి ఖాజా హుస్సేన్ చెరుకూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తులకు అండగా పద్మ భాస్కర్ ఫౌండేషన్

విశాలాంధ్ర - చీరాల : పద్మ భాస్కర్ ఫౌండేషన్ తరపున ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తున్నామని, అన్ని దానాలలో అన్నదానం గొప్పదని పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ అన్నారు. శనివారం 31వ వార్డ్ రోశయ్య కాలనీలో ఘంటా పద్మావతి అన్నదాన కారక్రమం నిర్వహించారు. ఘంటా అనిల్ మాట్లాడుతూ మేము చేస్తున్న సేవాకార్యక్రమాలు చూసి ఆకర్షితులై నన్నపనేని వెంకటసుబ్బరావు సతీమణి ఇందిరా దేవి స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. చీరాల ప్రాంతంలోని పేదలను గుర్తించి అన్నదానం నిర్వహించడం తనకు ఆత్మ సంతృప్తినిచ్చిందని, నాకు సహకరిస్తున్న మిత్రులకు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘంటా కుసుమ కుమారి,31వ వార్డు కౌన్సిలర్ సల్లూరు సత్యానందం,రోశయ్య కాలనీ ప్రజలు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రధాన కార్యదర్శిగా వెంకట్రావ్

విశాలాంధ్ర - మార్టూరు : తెలుగుదేశం పార్టీ మార్టూరు మండలం ప్రధాన కార్యదర్శిగా మార్టూరు నేతాజీనగర్‌కు చెందిన గొట్టిపాటి వెంకట్రావ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంకట్రావ్ నియామకాన్ని అందజేశారు. వెంకట్రావ్ గతంలో మార్టూరు 19 వ వార్డ్ మెంబర్‌గా పని చేశారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతం లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బహిరంగ సభ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : ఈనెల 14న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇంకొల్లు మండల కేంద్రంలో నిర్వహించే జై భీమ్ జై తెలుగుదేశం సభకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లేందుకు గ్రామ గ్రామాన సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాల మేరకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల టిడిపి అధ్యక్షుడు నలపనేని రంగయ్య చౌదరి, రాయపాటి సీతయ్య, కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారక రామారావు, కే వంశీ కృష్ణ కోయ సతీష్ బోయపాటి సాంబశివరావు, బత్తుల కోటేశ్వరరావు ఈరపననేని వాసు పత్తిపాటి వేణు బాబు సోమేపల్లి బాబు నిమ్మల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం చార్జీలు పెంచాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల ఆర్ట్స్ అండ్ డిగ్రీ సైన్స్ కళాశాల యందు డిగ్రీ పరీక్ష పత్రాల మూల్యాంఖనం చార్జీలను పెంచాలని అధ్యాపకులు ప్రిన్సిపల్ పి ఆంజనేయులుకు వినతి పత్రంలో అందజేశారు. డిగ్రీ పరీక్ష ఫలితాలు వెల్లడించే ముందు పరీక్ష పత్రాలను పరిశీలించే అధ్యాపకుల చార్జీలు రూ. 18 నుండి 30 పెంచాలని అధ్యాపకులు డిమాండ్ చేస్తూ ప్రిన్సిపల్ పి.ఆంజనేయులుకు వినతిపత్రాన్ని అందించి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై అధ్యాపకులు ప్రస్తుత పెరిగిన చార్జీలను దృష్టిలో ఉంచుకొని మా డిమాండ్‌ను ఆమోదించాల్సినదిగా ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విసో సంస్థ మట్టిలో మణిక్యాలు తీస్తుంది: డీఎస్పీ

విశాలాంధ్ర - చీరాల : మట్టిలో నుంచి మణిక్యాలు తియ్యడం ఏమంత సులువు కాదని గత పదహారేళ్లుగా విసో సంస్థ వ్యవసాయ కూలీల పిల్లలకు ఉచితంగా కోచింగ్ ఇచ్చి ఉన్నత కళాశాలలో సీట్లు సాధించి వారి ఉన్నతికి తోడ్పాటు అందించినందుకు అభినందిస్తున్నానని చీరాల డీఎస్పీ శ్రీ కాంత్ అన్నారు.శనివారం విసో సంస్థ ఉచిత ఎంసెట్, ఈసెట్, పాలిసెట్, కోచింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు అవ్వారు ముసలయ్య, మాట్లాడుతూ గత పదహారేళ్లుగా విసో సంస్థ పేదలకు ఉచితంగా కోచింగ్ ఇచ్చి ఉన్నత విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్డీవో సరోజిని మాట్లాడుతూ పేద విద్యార్థులకు డబ్బు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకునే అంత ఆర్థిక శక్తి ఉండదని విసో సంస్థ సొంత కుటుంబ సభ్యులలాగా చదువు గురించి గైడెన్స్ ఇస్తూ మెరుగైన ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందని అన్నారు.తహసీల్దార్ ప్రభాకర్ మాట్లాడుతూ మన తల్లిదండ్రులు ఎంత కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారో ప్రతి విద్యార్థి గ్రహించి విసో సంస్థ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు.చీరాల మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో ప్రభుత్వ ఉద్యోగాల కన్న ప్రయివేటు ఉద్యోగాలు పెరిగాయని మనం స్కిల్ డెవలప్ చేసుకొని ప్రయివేటు ఉద్యోగాలైన సాధించాలని అన్నారు.తదనంతరం విద్యార్థులకు అవసరమైన కెరీర్ గైడెన్స్ గురించి సలహాలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పేంత వరకూ పోరాటం ఆగదు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పార్లమెంట్ స్థానం ఎస్సీ రిజర్వ్ కావటం చారిత్రక తప్పు దుర్మార్గమని వాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి బహిరంగ క్షమాపణ చెప్పేంత వరకు పోరాటం ఆగదని అఖిల పక్ష దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ జిల్లా తొలి ఆవిర్భావ సందర్భంగా ఒక సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కోన దళితుల మనోభావాలు బాధించేలా మాట్లాడి ఇప్పుడు నాలుగు గోడల మధ్య ఉండి క్షమాపణ అడగటాన్ని తప్పుబట్టారు. బాపట్ల నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు కల్గి మీకు మీ తండ్రికి అధికారం తెచ్చి పెట్టిన ఎస్సీలకు బేషరతుగా బాపట్ల జమ్ములపాలెం ఫ్లైఓవర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇంటిని ముట్టడించి అడుగడుగున బాపట్లలో అడ్డుకుంటామని హెచ్చరించారు. కోనకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. అన్నీ దళిత సంఘాలతో ఐక్య ఉద్యమానికి కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు, అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక,బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, బీజేపీ యువజన అధ్యక్షులు మణికుమార్, యువజన ఉపాధ్యక్షులు కృష్ణ చైతన్య , నియోజకవర్గ అధ్యక్షులు కొచ్చెర వినయ్‌రాజు,అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మేకల ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దోనెపూడి దేవరాజ్, రవి, సుధాకర్ ,కిషోర్‌తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా రాజకీయ పార్టీ

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : బిసిల రాజ్యాధికారమే లక్ష్యంగా ఏపిలో రాజకీయపార్టీని ప్రకటించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. మండలంలోని ఐలవరం గ్రామంలో శనివారం బాపట్ల జిల్లా కమిటీల నియామక కార్యక్రమం జరిగింది. బాపట్ల జిల్లా ఉపాధ్యక్షునిగా ఐలవరం గ్రామానికి చెందిన జొన్నాదుల వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శిగా ఈడె శ్రీనివాసరావులను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘం బలోపేతమే ధ్యేయంగా గ్రామ స్థాయి నుంచి కమిటీలను నియమిస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో 175 నియోజకవర్గాల్లో పటిష్టమైనటువంటి కమిటీలను నియమించడం జరుగుతుందన్నారు. కమిటీలు బిసి రాజ్యాధికారం దిశగా సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముచితమైన ప్రణాళికలతో బిసిల సంక్షేమానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికలలో విజయం కోసం బిసిల వైపు చూస్తున్నాయని బిసిల ఐక్యంగా ఒకే బాటలో పయనిస్తే రాజ్యాధికారం సాధ్యమౌతుందని ఆయన చెప్పారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసిలకు సముచిత స్థానం కల్పించాలని లేకుంటే బిసిల సత్తా చూపిస్తామని శంకరరావు హెచ్చరించారు. అదే విదంగా మండలంలోని వెల్లటూరులో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన పెదలంక లక్ష్మీ మాధవి కుటుంబాన్ని కేసన పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, న్యాయ సలహా దారుడు నటరాజ్, యువజన నాయకులు రాజు, రాజేష్, నాయకులు తాతా సాంబయ్య, కూరపాటి రఘురామయ్య, పంచమర్తి శంకరరావు, శ్రీనావాసరావు, జొన్నాదుల రమేష్, గోపాల్, జొన్నాదుల లీలాకృష్ణ, బట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తాం..

- జిల్లా చైర్మన్ సురేష్‌బాబు

విశాలాంధ్ర - బాపట్ల : ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారించేంత వరకు ఉద్యమిస్తామని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ సి.హెచ్ సురేష్ బాబు తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నల్లకండువాలతో శనివారం నిరసన తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిన రెండో విడత ఉద్యమ కార్యచరణలో భాగంగా తాలూకా కార్యాలయ ఆవరణల నుండు బస్టాండ్ మెయిన్ రోడ్‌లలో నల్ల బ్యాడ్జీలు నల్ల కండువాలు ధరించి ఉద్యోగుల డిమాండ్లుతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పెన్షన్‌దారులకు 1వ తేదీని జీతాలు పెన్షన్లు చెల్లించాలన్నారు. సిపిఎస్‌ని రద్దుచేసి పాత ఓపీఎస్ని పునరుద్ధరించాలని ఈహెచ్ఎస్ ద్వారా క్యాస్ లెస్ వైద్యం జరగాలన్నారు. 12వ పేరివిజన్ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేసి పెండింగ్లో ఉన్న మూడు కొత్త డియేలను విడుదల చేయాలన్నారు. పిఆర్సి అరియర్స్ ను వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెఎసి జనరల్ సెక్రెటరీ కె.రజనీకాంత్, వైస్ చైర్మన్ పి.మురళి మనోహరరెడ్డి, ట్రెజరర్ య.దిలీప్, జిల్లా ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ఏపీఆర్ఎస్ఎ సిటీ యూనిట్ సెక్రెటరీ ఏ. సుమంత్ కుమార్, వీఆర్వో అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ డి.చంద్ర, వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ యమ్. సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ డి.పద్మావతి, పీటీడీ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కో అపరేటివ్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు, ఆర్ డబ్లుఎస్, శాఖ ఉద్యోగులు, వీఆర్వో, వీఆర్ఏ, సివిల్ సప్లైస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీస్తు కొరకు పరుగు...సువార్త ర్యాలీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : క్రీస్తు కొరకు పరుగు అనే సువార్త కార్యక్రమాన్ని ప్రతి ఏడాది పాస్టర్ ఏపీడబ్ల్యు కోల్, జాన్సన్, జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో అన్ని డినామినేషన్ల క్రైస్తవ సోదర సోదరీమణులతో కలసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక ఇండియన్ గ్యాస్ గోడం వద్ద నుండి విజయలక్ష్మి పురం ఎల్ఈఎఫ్ చర్చి మీదగా, ఇస్లాంపేట, దగ్గుమల్లివారిపాలెం, కొత్తపేట, హయ్యర్‌నగర్, విలియం బూత్ కాలేజీ వరకు క్రీస్తు కొరకు పరుగు కార్యక్రమాన్ని క్రైస్తవ ఆధ్యాత్మిక, పాటలతోనూ వాక్యాలతో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద క్రీస్తు ప్రబోధాలను ప్రకటించి పాత బస్టాండ్ మీదుగా, చీలు రోడ్డు, ఆర్ట్స్ కాలేజీ నుండి ఏబీఎన్ చర్చి వరకు ర్యాలీ సాగింది.

ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది క్రైస్తవ సోదరులతో కలిసి ఈ రీతిగా మానవాళి పాపమును నిమిత్తమే ప్రభువైన ఏసుక్రీస్తు సిలువలో రక్తం కార్చి చేసిన ప్రాణ త్యాగమును గురించిన సత్యమును బోధించి సమాజంలో విలువలు కలిగిన మానవత్వాన్ని చాటడమే ఈ కార్యక్రమా లక్ష్యం అని పేర్కొన్నారు. అన్ని సంఘాల నుండి వచ్చిన దైవజనులకు, యూత్‌కు, సండే స్కూల్ చిన్నారులకు, సౌండ్ సిస్టం, కీబోర్డు ప్లేయర్ బ్రదర్ బెన్నీ బృందానికి అభినందనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దైవజనులు మల్లెల సుధాకర్, విలియంబు జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ కెప్టెన్ కే డేవిడ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాసరి శ్యాం లివింగ్ సన్, మేకతోటి విజయ పాల్, మని భూషణ్, సుందర్, అంబేద్కర్ కాలనీ, ప్రసాద్, ప్రకాష్, పాస్టర్ సన్ బాబు, పాస్టర్ పీటర్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

గుంటి గంగ తిరునాళ్ల మహోత్సవం

విశాలాంధ్ర-తాళ్లూరు : లక్షలాది మంది భక్తుల తాకిడితో అంగరంగ వైభవంగా శనివారం గుంటి గంగ తిరుణాల మహోత్సవం ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుండి 11 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయగా వాటిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ, బుల్లితెర నటీ నటులు హాజరై తమ నట విన్యాసాలను శ్రోతల కొరకు ప్రదర్శించారు. వివిధ ప్రధాన పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలపై ఆయా పార్టీల అధినేతలు హాజరై ప్రసంగించారు. దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ,తాళ్లూరు మండల వైసిపి ఇన్చార్జ్ మద్దిశెట్టి రవీంద్ర, దర్శి నియోజకవర్గ వైసిపి నాయకులు మద్దిశెట్టి శ్రీధర్ వైసీపీ ప్రభలపై ప్రసంగించారు. దర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ,తదితరులు పాల్గొని ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీ ప్రభలపై తెలుగుదేశం పార్టీ నాయకులు పమిడి రమేష్, నారపుశెట్టి పాపారావు తదితరులు హాజరై ప్రసంగిం చారు. జనసేన పార్టీ తరపున వరి కూటి నాగరాజు అధినేతలు ప్రసంగించారు. గుంటి గంగ దేవాలయం వద్ద భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అన్ని వర్గాలకు చెందిన అన్నదాన సత్రాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలంలోని పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు ఆదాయపన్ను శాఖ అధికారి కురుగుల్ల సిల్వాన్ రాజు స్నేహలత వారి కుమారుడు సువర్ణ రాజు జన్మదిన సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు శనివారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సిల్వాన్ రాజు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఎంతో కష్టపడతారని ఇలాగే సహాయం చేయటం ఎంతో ఆనందంగా ఉందని కుమారుడు జన్మదిన సందర్భంగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎంపీపీ

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం నల్లగుంట్లలో ఈ నెల 8వ తేదీన గుడ్ ఫ్రైడే, ఈస్టర్ దేను పునస్కరించుకొని రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీలను స్థానిక ఎంపీపీ కామూరి అమూల్య లాంఛనంగా ప్రారంభించారు. పోటీల్లో మొత్తము 6 జట్లు పాల్గొన్నాయి. మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి, ఎంపీపీ కామూరి అమూల్య, ఎంపీటీసీ కామూరి శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో దాదాపు 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోటీల విజేతల్లో ప్రధమ బహుమతి ఎర్రబాలెం గ్రామానికి చెందిన వెంకటగిరి హేమలత నాయుడు 30 వేల నగదును సొంతం చేసుకోగా, ద్వితీయ బహుమతీ సిద్ధిమూర్తిపల్లి గ్రామానికి చెందిన మారాంరెడ్డి జయరాం రెడ్డి 20 వేల నగదును, తృతీయ బహుమతి నరసాపురం గ్రామానికి చెందిన ఎస్ఎంఎస్ బుచ్చా 10 వేల నగదును గెలుపొందటం జరిగింది.

విశాలాంధ్ర

బాపట్ల జిల్లా

నా వాఖ్యలకు బాధపడి ఉంటే క్షమించండి: కోన

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పార్లమెంట్ ఎస్సీ రిజర్వేషన్ మీద వేరే అభిప్రాయాన్ని చెప్పటానికి ప్రయత్నం చేశాను తప్ప ఎస్సీలను కించపరిచే ఉద్దేశ్యం తనకు లేదని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. కోన తన ఇంటిలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బాపట్ల పార్లమెంట్ ఎస్సీ రిజర్వ్ చేయటం జేడీ శీలంకు లబ్ది జరిగిందని బాపట్ల జిల్లాకు చారిత్రాత్మక తప్పిదంగా దుర్మార్గంగా ఉందనే విషయం చెప్పానన్నారు. ఇదే విషయాన్ని కొంతమంది వక్రీకరించి ఎస్సీలను, రిజర్వేషన్‌ను తప్పుగా మాట్లాడాడని అంటున్నారని నా ఉద్దేశ్యం మాత్రం అలా కాదన్నారు. ఈ విష యంలో ఎవరూ బాధపడ్డా క్షమించమని కోరుతున్నట్లు కోన తెలిపారు.

బాపట్లలో ఆగిన వందేభారత్ ట్రైన్

విశాలాంధ్ర - బాపట్ల : సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న వందే భారత్ ట్రైన్ శనివారం సాయంత్రం బాపట్ల రైల్వే స్టేషన్‌లో ఆగింది. సికింద్రబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వందేభారత్ ట్రైన్ ప్రారంభి ంచిన అనంతరం సాయంత్రం 5 గంటల తరువాత బాపట్లకు చేరుకుంది. ఎమ్మెల్యే కోన రఘుపతి రైల్వే అధికారులు స్వాగతం పలికారు. బాపట్లలో కోన జెండా ఊపి ట్రైన్‌ను ప్రారంభించారు. అనంతరం కోన ట్రైన్‌లో ఎక్కి చీరాల వరకు ప్రయాణం చేశారు. రైల్వే స్టేషన్‌లో కోన పార్టీ నాయకులు, రైల్వే సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. బాపట్ల పుర ప్రజలు ట్రైన్‌ను చూసేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. పట్టణ సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎన్జీరంగా అనుచరుడు రామప్రకాశరావు మృతి

విశాలాంధ్ర - జె.పంగులూరు : స్వతంత్ర పార్టీ నాయకుడు, ఎన్జీరంగా అనుచరుడు రావూరి రామ ప్రకాశ రావు(84) శనివారం మధ్యాహ్నం పంగులూరులోని ఆయన స్వగృహంలో మరణించాడు. వృద్ధాప్యం కారణంగా గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. రామప్రకాశరావు యువకుడిగా ఉన్నప్పటి నుంచి చైతన్యవంతంగా ఉండేవాడు. 50 ఏళ్ల క్రితం ముప్పవరం నుండి పంగులూరుకు రోడ్డు కాంట్రాక్టర్ సరిగా వేయటం లేదని అవకతవకలకు పాల్పడుతున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునే విధంగా చేశాడు. అప్పట్లో అధికారులకు పత్రాలు రాసి ఫిర్యాదు చేయడం అనేది ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. రామ ప్రకాశరావు 1977లో జనతా పార్టీలో చేరాడు. స్వతంత్ర పార్టీ నాయకుడు ఎన్జీరంగా కు అభిమానిగా, అనుచరుడుగా ఉంటూ కార్యక్రమాలలో పాల్గొనేవాడు. 1987వ సంవత్సరం పత్తి రైతుల ఆత్మహత్య ఉద్యమాలు జరుగుతున్న సమయంలో ఎన్జీరంగా పంగులూరు వచ్చినప్పుడు ఆయన వెంట ఉండి సమస్యలను తెలియజేశాడు. తరువాత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు సన్నిహితంగా ఉన్నాడు. వెంకయ్య నాయుడు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా ఉన్న సమయంలో పంగులూరులో రామ ప్రకాశరావు ఇంటికి వచ్చాడు. మరణించిన రామ ప్రకాష్ రావుకు భార్య రమాదేవి, కుమారులు వెంకట సుబ్బారావు, నాగజ్యోతి, కుమార్తె మహాలక్ష్మి ఉన్నారు. వెంకట సుబ్బారావు కొండమూరు గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. మరో కుమారుడు నాగజ్యోతి ముంబైలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం నాడు అంత్యక్రియలు జరుగుతాయి అని కుటుంబ సభ్యులు తెలిపారు.

దుకాణాల లైసెన్స్ హక్కులకు ముగిసిన వేలం

విశాలాంధ్ర-అద్దంకి : సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద వివిధ దుకాణాల ద్వారా 2023-24సంవత్సరానికి వ్యాపారాలు నిర్వహించుకు నేందుకు శనివారం దేవస్థానం అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. వేలం ద్వారా దేవస్థానానికి రూ 1కోటి4లక్షల76వేల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి సుభద్ర తెలిపారు. అద్దంకి దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పి.శైలేంద్రకుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు.

ఘర్ ఘర్ గావ్ చలో కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-అద్దంకి : బిజెపి జాతీయ ఓబిసి ఘర్ ఘర్ గావ్ చలో కార్యక్రమంలో భాగంగా బాపట్ల ఓబిసి జిల్లా అధ్యక్షులు ఉండవల్లి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బూదాటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావులు శనివారం అద్దంకి, మేదరమెట్ల, రేణింగవరం, జె.పంగులూరు, సింగర కొండపాలెం గ్రామాలలో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు.

మార్టిన్ లూథర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర-కంభం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మార్టిన్ లూథర్‌కు 9,10 తేదీలలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం అందింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, శ్రీ శ్రీ కళావేదిక వారి ఆధ్వర్యంలో గిన్నిస్ ప్రపంచ రికార్డ్ లక్ష్యంగా 48 గంటలు నిరాటంకంగా దాదాపు 15 వందల మంది కవులు కళాకారులు పాల్గొననున్నట్లు మార్టిన్ లూథర్ తెలిపారు. ఈ ప్రాంతం నుండి ఆహ్వానాన్ని అందుకున్న మార్టిన్ లూథర్‌ను విద్యాశాఖాధికారి బి.మాల్యాద్రిని పలువురు అభినందించారు.